క్లుప్తంగా

ఎమ్మెస్సార్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ స్వామిదాస్

కొండపి: స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల విద్యార్థినీలు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఈ స్వామిదాసు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సార్ డిగ్రీ విద్యా సంస్థ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాలలో ఫైనల్ ఇయర్ పూర్తయిన డి.చిట్టి ప్రథమ స్థానాన్ని, కె. మేరీ తృతీయ స్థానాన్ని సాధించారని తెలిపారు. వీరికి ఆదివారం ఒంగోలులో పీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో మాగుంట సుబ్బరామిరెడ్డి 29వ వర్ధంతి సభలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడిడ్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారు.

50 మందికి పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సింగరాయకొండ: స్థానిక షిర్డీ సాయిమందిర్‌లో ఆదివారం దాతల సహకారంతో వృద్ధులకు ఫించన్ పింపిణీ చేసినట్లు ఆలయ నిర్వాహకులు కొల్లూరు సత్యన్నారాయణ తెలిపారు. ప్రతి నెల 50 మందికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఇష్టపడి చదవాలి



చదవడం మాకిష్టం కార్యక్రమం

ఉలవపాడు: విద్యార్థులు ఇష్టపడి చదవాలని స్థానిక గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం, చాకిచర్ల బుక్ కీపింగ్ సెంటర్‌లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదివి జ్ఞానం పెంచుకోవాలన్నారు. విద్యార్థులతో మహనీయుల చరిత్ర, జాతీయ నాయకుల చరిత్రలు చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పొదల మాటున ప్రమాదం



పొదలతో నిండి ఉన్న విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

టంగుటూరు: మండలంలోని మల్లవరప్పాడు గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పొదల్ల మాటున ప్రమాదకరంగా మారింది. గ్రామంలో వాహనదారులు, పశుపోషకులు, పొలాలకు వెళ్లే రైతులు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. దీనికి తోడు పశువుల మేత మేసే ప్రాంతం కూడా ఇదే కావటంతో పశుపోషకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రైతులు, పశుపోషకులు నిత్యం విద్యుత్ స్తంభం పక్కనే వెళుతుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదల్లతో మూసుకుపోయి ఉండటంతో భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా ఉండాలని కోరుతున్నారు.



చిన ఓగూరులోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద రోడ్డు



చిన ఓగూరు గ్రామంలో తారు రోడ్డు

చినుకు పడితే చిత్తడే

కందుకూరు రూరల్:

మండలంలోని ఓగూరు పంచాయతీ రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్ష కురిస్తే చాలా చిత్తడిగా మారుతున్నాయి. తారు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ చేరి వాహనాల రాకపోలతో అధ్వానంగా తయారవుతున్నాయి. ఓగూరులోని ఓవీ రోడ్డు నుంచి చిన ఓగూరు, పెద ఓగూరు వరకు తారు రోడ్డు తారు లేచిపోయి, అక్కడక్కడా గుంతలు పడి ఉన్నాయి. చిన ఓగూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పెద్ద గుంత ఏర్పడి వాహనాల రాకపోకలు అంతరాయంగా మారింది. వర్షపు నీరు నిల్వ చేరడంతో వాహనాలు పక్కకు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా చిన ఓగూరులోని మెయిన్ తారు రోడ్డుపై చిన్న చిన్న గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షపు నీరు నిల్వ చేరి వాహనాలు తిరుగుతుండటంతో ఆ గుంతల్లోని నీరు చింది పక్కన వెళ్లే వారి పడుతున్నాయి. ఆ చిన్న గుంతలే పెద్దగుంతలుగా మారుతున్నాయి. అదే విధంగా చిన ఓగూరు నుంచి పెద ఓగూరు వేళ్లు తారు రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు తిరుగుతుంటాయి. నూతన వ్యక్తులు గుంతలను గమనించకుండా వేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై కనీసం మట్టితో అయినా గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చిన ఓగూరు నుంచి పెద ఓగూరు వెళ్లే రోడ్డు

అధ్వానంగా రోడ్డు

వలేటివారిపాలెం: మండల కేంద్రం వలేటివారి పాలెం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతలమయమై వర్షపు నీరు నిల్వ చేరుతోంది. వాహనాలు రాకపోకల సమయంలో పాదచారులకు ఇబ్బందికంగా మారింది. వాహనాలు వేగంగా వెళ్తున్న సమయంలో ఆ వైపు ద్విచక్ర వాహనాలు గానీ, పాదాచారులుగానీ వెళ్తుంటే ఆ గుంతల్లోని నీరు ఎగిరి వారిపై పడుతున్నాయి. మెయిన్ రోడ్డు, బస్టాండ్ సెంటర్ కావడంతో వర్షం పడిందే రోడ్డుపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



వలేటివారిపాలెం బస్టాండ్ వద్ద రోడ్డు దుస్థితి

ప్రజలను వంచించడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్

- ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచమని హామీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత వీరబాదుడు
- హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్



బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారెంటీ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ప్రజలను వీరబాదుడు బాదుతున్నాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదివారం ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచనని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు ట్రూ అప్ చార్జీల పేరుతో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, ప్రస్తుతం రూ.9,412 కోట్లను ప్రజల నుంచి వసూలు చేసేందుకు సిద్ధమయ్యారని వివరించారు. ఈ ఆరు నెలల్లోనే రెండు సార్లు ట్రూఅప్ చార్జీలు వేసిన చంద్రబాబు మొత్తం రూ.15,485.36 కోట్లను ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చెప్పిన బాబు ష్యూరిటీ ఏమో గానీ ప్రజలకు బాదుడు గ్యారెంటీ అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. ఎన్నికల సమయంలో కరెంట్ చార్జీలు తగ్గిస్తానని ఊరూవాడా ప్రచారం చేసి ట్రూ అప్ చార్జీలు ఎత్తివేస్తామని బీరాలు పలికిన చంద్రబాబు తాను ఏమీ హామీ ఇవ్వలేదంటూ ఇప్పుడు బుకాయిస్తున్నారని బుర్రా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండో సారి ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.9,412 కోట్ల ప్రజలపై భారం మోపారని, దీంతో ప్రతి యూనిట్‌పై రూ.0.92 అదనపు భారం ప్రజలపై పడుతుందని వివరించారు. డిసెంబర్ వినియోగం నుంచే పెంచిన చార్జీలు అమల్లోకి వస్తాయని, అంటే వచ్చే ఏడాది జనవరి నుంచి కరెంట్ బిల్లులో ఈ చార్జీలు వసూలు చేస్తారని చెప్పారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపిందని, ఇప్పటికే కూటమి ప్రభుత్వం దీపావళి పండగ సందర్భంగా రూ. 6072.86 కోట్లు ప్రజలపై భారం వేసిందన్నారు. ఈ చార్జీలను నవంబర్ నెల నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. కరెంట్ చార్జీల పెంచడం అంటూ చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారని, వీటిలో పులివెందుల, కడప టీడీపీ మహానాడు సమావేశాల్లో, గత ఆగస్టులో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ సమావేశంలో, వైజాగ్ రీజనల్ డాక్యుమెంట్ విడుదల సమయంలోనూ కరెంట్ చార్జీలు పెంచం అంటూ హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు ప్రజలపై వేస్తున్న భారాన్ని ఇప్పటికైనా తగ్గించాలని, ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండి ప్రజలకు భారంగా మారుతున్న ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్ చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యత

సీఎస్‌పురం(పామూరు): ఎయిడ్స్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇందు కోసం యువత నడుం బిగించాలని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి, ఉద్యానవన కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని శీలంవారిపల్లెలో కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల డీన్‌లు మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధిపై గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో వ్యాధిపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు డివిజన్, జిల్లాస్థాయి వైద్యశాలలో తగు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందజేస్తున్నదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: ఎయిడ్స్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంధం ప్రసాద్ అన్నారు. స్థానిక పామూరు చిల్డ్రన్స్ హోంలో ఆదివారం సంస్థ చైర్మన్ నూనె వేణి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఎయిడ్స్ నియంత్రణపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. విజయమ్మ, కో ఆర్డినేటర్లు ఏలియా, ఆదాం, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కనిగిరిలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర నేతృత్వంలో మండల న్యాయ సేవాధికార సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీఎల్‌ఏసీ కనిగిరి సెంటర్ స్టాఫ్ నర్సు రాజేశ్వరి న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, గుడ్ హెల్ప్ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



శీలంవారిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పామూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం, సంస్థ చైర్మన్



అవగాహన ర్యాలీలో చైర్మన్ అబ్దుల్ గఫార్

నేరపూరిత కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

పొన్నలూరు: నేరపూరిత కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనుక్ హెచ్చరించారు. పొన్నలూరు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా అనుమానితులపై నిఘా ఉంచుతున్నామన్నారు. అలాగే కార్లు, బైక్‌లు ఇతర వాహనాల్లో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం తరలించకుండా ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. అలాగే ప్రజల్లో శాంత్రి భద్రతలపై నమ్మకం కలిగి విధంగా రాత్రి సమయంలో పోలీసులు గస్తీ తిరుగుతున్నారన్నారు. చట్ట వ్యతిరేక పనులకు ఎవరు పాల్పడిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



పొన్నలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై అనుక్

విద్యార్థుల్లో స్థైర్యాన్ని నింపేందుకే మోడల్ టెస్టులు

కనిగిరిరూరల్: విద్యార్థుల్లో స్థైర్యాన్ని నింపి.. మనో ధైర్యాన్ని నింపేందుకే టాలెంట్ టెస్టులు అని ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ టెస్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు జి.శ్రీనివాసులు, సంజీవి, యువీ నారాయణరెడ్డి, నాగిరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో పాల్గొనం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల భయాందోళన పోతాయన్నారు. గణితంలో సులభ మార్గంపై అవగాహన కల్పించారు. మోడల్ టెస్టు పరీక్షలకు ఆర్థిక సాయం అందించిన పగడాల వెంకటేశ్వరరెడ్డి, గోనుగుంట పవన్ కుమార్, ద్వారశీల ప్రసాద్‌రెడ్డి, తాళ్లూరి రమణయ్య, రాంబాబు, నరేన్ చౌదరిలను కొనియాడారు. ఎన్‌ఎంఎంఎస్ పోటీ పరీక్షల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వెలిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్ కాజా నాగూర్, ఆర్ జితేంద్ర, బి.కీర్తిరెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హసన్ ఖాన్ నాల్గవ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దేవిరెడ్డి రామిరెడ్డి, దాతలు, ఎంఈఓలు

వైభవంగా యాదవుల ఆత్మీయ సమ్మేళనం

కనిగిరిరూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని యాదవుల కార్తీక వన మహోత్సవ వేడుకలు ఆదివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని నేలటూరి గొల్లపల్లిలో కాటమరాజు గుడి దగ్గర జరిగిన యాదవ ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. తదనంతరం ఆలయంలోని కాటంరాజుకు, గంగమ్మ తల్లికి దద్దాల ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వన భోజనాలకు రూ.50 వేల విరాళాన్ని దద్దాల నారాయణ అందచేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ యాదవులంతా ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, పెన్నా వెంకటేశ్వర్లు, మద్దెబోయిన ఉమా మహేశ్వరి, చింతం శ్రీనివాసుల యాదవ్, గాలిబోయిన ధనంజయ్, గొబ్బిళ్ల శ్రీను, తెల్లగడ్డం వెంకట్రావ్, దాసరి మాల్యాద్రి, దద్దాల రాములు, వేల్పుల వెంకట సుబ్బయ్య, పల్లపాటి బ్రదర్స్ పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కనిగిరిరూరల్: కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ కమిషనర్ దానియెల్ జోసెఫ్ మున్సిపల్ అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి పట్టణ ప్రజలకు నీటి ఎద్దడని తీర్చేందుకు ప్రస్తుతం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ డానియెల్ జోసెఫ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో గతంలో వినియోగంలో ఉండి ప్రస్తుతం వినియోగించకుండా ఉన్న బోర్లను పరిశీలించి వీలైనంత త్వరలోనే పట్టణ ప్రజలకు పుష్కలంగా నీటిని అందిస్తామన్నారు. మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, మెప్మా సిబ్బంది కె.రఘు, కౌన్సిలర్ ఖరీమున్ ఖాసీంసా పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్, కమిషనర్

వైభవంగా గోపూజ, మహానివేదన



నూతన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి విగ్రహమూర్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని అయ్యలూరివారిపల్లె తిరుమల నాథస్వామి ఆలయంలో దాతలు రూ.30 వేలతో చేయించి ఆభరణాలకు పూజలు చేసి స్వామి మూల విగ్రహమూర్తులకు అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

కాలభైరవునికి ప్రత్యేక పూజలు

జరుగుమల్లి(సింగరాయకొండ): కార్తీక మాసం ఆఖరిరోజు, ఆదివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట కాలభైరవుని ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో బూడిదగుమ్మడి కాయ దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా నెలరోజుల పాటు ఉభయదాతగా వ్యవహరించిన దేవిసీ ఫుడ్స్ మేనేజర్ గిరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి



ఆలయానికి పోటెత్తిన భక్తులు